నిజమే. ఐక్యకాంగ్రెసు శాసనసభా పార్టీ వారు పై తీర్మానాన్ని చేయునప్పుడు సంజీవరెడ్డి ముఠాకు చెందినవారు 25 మంది పనికిరాదని వాదించిన మాటనిజమే. వచ్చిన అవకాశాన్ని పోగొట్టుకొనగూడదనెడి ఉద్దేశ్యంతో గోపాల రెడ్డి ముఠావారు సంఖ్యాబలంతో తమ పంతాన్ని గెలిపించుకున్నా మాటగూడా నిజమే.

ఇంత మాత్రంతో రాష్ట్రకాంగ్రెసు నాయకత్వంలోనున్నవారిని బలపరచెడి శాసన సభ్యులపని పూర్తి అయిందా? రాష్ట్రకాంగ్రెసు బాధ్యత తీరి పోయిందా? లేదు.

వెంటనే రాష్ట్ర జిల్లాల కాంగ్రెసు సమావేశాలు జరగాలి. జిల్లాబోర్డుల విషయంలో ప్రభుత్వం వర్గంజేసిన తీర్మానాన్ని ఖండించాలి. ప్రమాద భరితమైనటువంటి తప్పుదారిని నడుస్తూన్న వారిని దారిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయాలి.

ఈ పని అంతటినీ కాంగ్రెసు పార్టీకే వదిలేయడం గూడా మంచిదిగాదు. రాష్ట్రంలోగల ప్రజాస్వామిక వాదులంతా కదలాలి. ఏది న్యాయమో! మరేది అన్యాయమో! ఆలోచించాలి. తగు నిర్ణయం జేయాలి. కాంగ్రెసు నాయకత్వ మవలంభించుతూన్న దివాళాకోరు విధానాన్ని ఖండించాలి.

**కథానిక**

# శరభయ్య త్యాగం

"పారిజాత"

ఆ గ్రామంలో ఒక శుభముహూర్తాన హయ్యర్ ఎలిమెంటరీ స్కూలుకు గ్రామ మునసబు శరభయ్య హర్షధ్వానాలమధ్య ప్రారంభోత్సవం జరిపాడు. తన ప్రారంభోపన్యాసంలో— "ఎట్టకేలకు మన గ్రామంలో హయ్యర్ గ్రేడ్ పాఠశాల ఏర్పడినందుకు మనం నిజంగా అదృష్టవంతులం. మన పిల్లలు యింక పైచదువులకు చుట్టుప్రక్కల గ్రామాలకు పోనక్కర్లేకండా—యింత పెద్ద శ్రమ తీసుకొని—పాఠశాలను యింతగా అభివృద్ధిలోనికి తీసుకొచ్చిన శ్రీ వెంకటేశంగారికి మనమెంతో కృతజ్ఞులం. ఆయన యీ హెడ్మాష్టరు పదవిలో మన స్కూలు దినదిన ప్రవర్థమానమై—మన పిల్లల భావి పురోగతికి పునాదులువేసి—గ్రామ సౌభాగ్యాన్ని పెంపొందించి—దేశ గౌరవాన్ని యినుమడింపజేయగలదని ఆశిస్తూ యింతటితో యీ శుభ కార్యాన్ని ప్రారంభిస్తున్నా" అని తడుముకోకండా మంచినీళ్లు త్రాగినట్లుగా ఉపన్యసించాడు.

హర్షధ్వానాలమధ్య హెడ్మాష్టరు వెంకటేశం లేచి నిలబడి— "నన్ను గురించి మునసబుగారు చాలా చెప్పారు. ఇందులో నేనుచేసింది ఏమీలేదు. నేను కోరినప్పుడల్లా మీరంతా నాతో పూర్తిగా సహకరించడంవల్లే యీ ఘనకార్యాన్ని మనం సాధించగలిగాం. మన స్కూలును ఎంతకాలంనుంచో ఈ స్థితికి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. కాని యింతకాలానికి జిల్లాబోర్డువారి అనుమతిపొందగలిగాం. కాని వారేనా నోటిమాటగానే ఆర్డరిచ్చారు. కాగితంద్వారా మనం ఆర్డరు సంపాదిస్తేనేగాని విశ్రమించరాదు. ప్రస్తుతం నేటినుంచి ఆరవ తరగతి ప్రారంభిస్తున్నాం. రెండుమూడు మాసాలలో జిల్లాబోర్డు ఆఫీసరుగారు తనిఖీకి వస్తామంటున్నారు. అప్పటికి కొంతగానైనా పురోభివృద్ధి కనుపించితీరాలి. ముందుగా మనం కొంత పెట్టుబడి పెట్టుకొంటేనే గాని—పని ముందుకు సాగదు. ముఖ్యంగా దేశ పటములు, జిల్లాపటములు, ఒక గ్లోబు, ప్రపంచపటము, కొన్ని ముఖ్యమైన పరికరములు, పుస్తకములూ కావలసివున్నవి. దీనికోసం అథమం మూడువందల రూపాయలైనా అవుసరం వుంటుంది. పంచాయతీబోర్డువారు కొంత సహాయం చేస్తామన్నారు. మిగతాది మీలో ఎవరికితోచినది వారు తృణమో పణమో యివ్వాలనినా మనవి.

మీరంతా కలగజేసుకోకపోతే యీ ఘనకార్యం గట్టెక్కదు. మీకు తోచినది శ్రీ శరభయ్యగారికి అందజేయమని నా మనవి" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

శరభయ్యగారు తనవంతు విరాళంగా ఏభై రూపాయిలు ప్రకటించారు. సదస్యులవైపు కన్నెత్తి ఓరగా చూడగానే పెద్దకాపు రంగయ్య మోతుబరి-రైతునాయుడు కోటయ్య తలాక ఏభై చదివించారు.

గ్రామంలో నవచైతన్యం వెల్లివిరిసింది. ఎవరి మట్టుకు వారు శరభయ్యగారికి ముడుపులు చెల్లించారు. అనుకోనంతగా ఉత్సాహం పెల్లుబికి—ఆశించినదానికి రెట్టింపుగా చందాలు పోగుబడినై.

జిల్లా విద్యాశాఖాధికారి వస్తున్నట్లుగా శ్రీముఖం వచ్చింది. వెంకటేశం శరభయ్య దర్శనం చేసుకొన్నాడు. శరభయ్య చెప్పిన మాటలు వెంకటేశం తప్పక నమ్మాల్సి వచ్చింది. ఋజువులు, రాద్ధాంతాలు చేసే సమయం కాదు నలుగురితోనూ. కనీసం ఆలోచించటానికీ కూడా తీరికలేదు. శరభయ్య యిచ్చిన ఏభైరూపాయిలు తీసుకొన్నాడే గాని——ముష్టి ఏభైరూపాయిలు ఎందుకూ పనికిరావని అతనికి పూర్తిగా తెలుసు. ఇంతకాలం గ్రామ ప్రజలు విరాళాలివ్వలేదంటే వెంకటేశం నమ్మలేక పోయేడు. కనీసం వాగ్దానాలు చేసినవేనా వసూలయితే రెండొందలు మించి వుండేవి. అవీ చేతి కందలేదంటే వెంకటేశం నోరు మెదపలేక పోయేడు.

జిల్లా అధికారి వచ్చేరోజు దగ్గర పడేకొలదీ వెంకటేశంలో తొందర జాస్తీ కాసాగింది. ముందుగా తను పెట్టుబడి పెడితే తర్వాత శరభయ్యవద్ద తీసుకొని సర్దుబాటు చెయ్యొచ్చుననే వుద్దేశ్యంతో ఆనెల జీతాలచెక్కును. ట్రెజరీలో మార్చి దీనికోసం వినియోగించాడు. సాధారణంగా ఉపాధ్యాయుల చెక్కులకు ట్రెజరీలో కాష్ తక్కువగావుండే రివాజు మారిపోయి వెంకటేశం చెక్కు మారిపోయింది!

జిల్లా అధికారి స్కూలుకు రావడం జరిగింది. స్కూలు దివ్యంగా అలంకరించబడింది. పచ్చటి తోరణాలు ఎటు చూసినా చూడ ముచ్చటగా వున్నాయ్. స్కూలు గోడలన్నీ వెల్లవేయబడినై. గోడలకు దేశపటములు వగైరాలు వ్రేలాడుతున్నాయ్. కొన్ని కొత్త కొత్త వస్తువులుకూడా అక్కడక్కడ కనుపిస్తున్నాయ్.. లైబ్రరీ పుస్తకాలు కొత్త బీరువాలో అలంకరించబడినై. గుమ్మానికెదురుగా మహాత్ముని పెద్ద ఫోటో ఒకటి వ్రేలాడుతోంది.

హారతి కర్పూరపు చెమ్కీదండలు ఆఫీసరుగారి మెడలో తళతళ మెరుస్తూండగా రెండు ఫోటోలు తీయబడినై. ప్రక్కనే శరభయ్యగారు సైడు ఫోజులో ఒకటి, వర్టికల్‌గా ఒకటీ తీయించుకొన్నారు ఆయనతోపాటు.

ఆ వెనుక ఆఫీసరుగారి గౌరవార్థం చిన్న తేనీటి విందు జరిగింది. (చెప్పటానికి మామూలుగా 'చిన్న విందు' అని అనటం రివాజు) దీనికంతా సొమ్ము ఎక్కడిదాయనే ధర్మసందేహం ఒక్క శరభయ్యలోనే కలిగింది-కా-ఆ విందుకు వచ్చిన మిగతా పెద్దలందరికీ ఏమాత్రం సందేహం కలగలేదు. ఈ జరిగిన తతంగమంతా తమతమ విరాళాల వల్లనే జరిగిందని వారి నమ్మకం.

వానకురిసి వెలసినట్టుగా గ్రామమంతా మాటుమణిగిపోయింది. కాని వెంకటేశం హృదయంలో మాత్రం యింకా చినుకులు పడుతూనే వున్నాయ్. ఆ చినుకులు రానురాను పెద్దగాలి దుమారంగా మారడానికి అట్టేసేపు పట్టలేదు.

నవంబరు నెలలో జరిగిన ప్రారంభోత్సవంనాటి వెల్లువ వెంకటేశంలోగాని-శరభయ్యలోగాని లేవు. లాంఛనంగా ఆగస్టులోనే ప్రారంభోత్సవం జరిగినా నవంబరు దాకా శరభయ్య-వెంకటేశం యిరువురూ కలుస్తునే వున్నారు, నవంబరులో ఆఫీసరుగారు వచ్చి వెళ్ళగానే శరభయ్య వెంకటేశానికి కనుపించడం మానేశాడు.

సెప్టెంబరు నెలజీతాలు అందకుండానే డిసెంబరు దాకా జీతాలు చేతికందినయ్. సెప్టెంబరు నెల నుంచీ అక్విటెన్సు రిజిస్టర్లు చేరలేదని-జిల్లాబోర్డు నుంచి తాఖీదులు వచ్చి పడుతున్నాయ్. సెప్టెంబరు నెల జీతాల గురించి తోటి ఉపాధ్యాయుల ఒత్తిడి ఎక్కువైపోతుంది. తోటివారంతా సంతకాలుపెట్టి పిటిషన్ పెట్టుకొని-పైకిపంపవలసిందిగా వెంకటేశానికిస్తే అది కాస్తా తొక్కిపెట్టి వుంచేడు.

ఈలోగా శరభయ్య కోసం వెంకటేశం గాలించడం ప్రారంభించాడు. ఏవో మాటలుచెప్పి లేడని పిస్తున్నాడా. ఎల్లాగైతేనేం శరభయ్య దర్శనం ఐంది. మాస్టర్ల జీతాలన్నీ వాడేశానని అక్విటెన్సు రోల్సు నాల్గుమాసాలనుంచీ పంపలేదనీ, కుప్ప తిప్పలగా మెమోలు వస్తున్నాయనీ, తోటి మాస్టర్ల గోల ఎక్కువై పోతోందనీ, వాళ్ళ పిటిషన్ పైకిపంపకుండా తొక్కిపెట్టాల్సి వచ్చిందనీ యింకా ఏమేమో గోలగా చెప్పుకున్నాడు పాపం! వెంకటేశం.

కాని శరభయ్యకు యీగోల వినిపించలేదు. ఏదో బాకీ వున్నవాడికి మల్లే రోజూ తనకోసం తిరగడం అట్టే బాగా లేదని మందలించాడు. గ్రామంలో వసూళ్ళు కాలేదని దబాయించాడు. వెంకటేశం జీవితంలో అంధకారం ప్రవేశించింది.

కనబడ్డవారినల్లా అడిగేవాడు అప్పుకోసం. కాని ఎంత దొరికినా అందరిజీతాలూ పోగవద్దూ. ఎంతమందివద్ద ప్రోగుచేస్తే వస్తుంది—అయిదొందల రూపాయిల చిల్లర!.

వెంకటేశం ఎంతగా ఆలోచించినా ఒక దారికి రాలేకపోయేడు. అయిదొందలు సంపాదించే మార్గం కానరాలేదు. తనకా—ఆస్తి ఏమీలేదు అమ్మటానికేనా.

పిత్రార్జితమా ఏమీలేదు, భార్య మెడలో వున్నది ఒక్కటే-మాంగళ్యం, అదితప్ప వేరే గత్యంతరంలేదు అది అమ్మినా వంద దాటదు. ఏంచేయడానికీ తోచక వెంకటేశం పిచ్చెక్కినట్టు తిరుగుతున్నాడు.

ఇరవై నాల్గుగంటల్లో అక్విటెన్సు రోల్సు పంపకపోతే సస్పెండుచేస్తున్నామని తాఖీదు వచ్చింది. గబగబా శరభయ్యకోసం పరుగెత్తాడు. శరభయ్య గ్రామంలో లేడని యింట్లోంచి కబురొచ్చింది. యిద్దరుముగ్గురు పెద్దల్ని కలుసుకున్నాడు—లాభం లేకపోయింది. కాని చిత్రమేమంటే—ఎవరిదగ్గరా తను జీతాలు వాడేసినట్లుగానూ. శరభయ్య తనకేమీ యివ్వనట్టుగానూ —చెప్పకపోడమే— అదే వెంకటేశం చేసిన పొరపాటు.

జీతాలు మాకు ముట్టలేదని-మాష్టర్లదగ్గర్నుంచి డైరెక్టుగా జిల్లాబోర్డుకు పిటిషన్ పోయింది. ట్రెజరీలో ఎంక్వైరీచెయ్యగా చెక్కు కాష్ అయినట్టుగా ఋజువయింది. అక్విటెన్సు రోల్సు పంపకపోడానికి యిదే కారణంగా భావించి-వెంటనే-వెంకటేశాన్ని ఉద్యోగంనుంచి తప్పిస్తూ ఆర్డర్లు జారీచెయ్యబడినై.

వెంకటేశం నోరు మెదపకుండా తప్పుకున్నాడు పదవినుంచి. వెంకటేశం జీతాలు వాడుకున్నాడని తెలిసి ఊరంతా తెల్లబోయారు. కొంతమంది వెంకటేశాన్ని పరామర్శించి అసలు విషయం ప్రస్తావించగా—నిజం బయటపడింది. ఎవరిమట్టుకు వారు ఎంతెంత విరాళంగా యిచ్చిందీ ఏకరువు పెట్టడం ప్రారంభించారు. దీంతో శరభయ్య బండారం బయటపడింది.

గ్రామ ప్రజలవద్దనుంచి సుమారు వెయ్యి సంతకాలతో ఒక మహాజరు జిల్లాబోర్డు ఆఫీసు చేరింది. దానిమీద ఇంక్వైరీ జరిగింది. దాంతో శరభయ్య నాటకం బయటపడింది. వెంకటేశం చేసిన పని రూల్సుకు వ్యతిరేకమూ—అధికారాన్ని దుర్వినియోగమూ పర్చింది. కాని గ్రామపురోభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసి తత్ఫలితంగా తలెత్తిన దుష్టశక్తులను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు అభినందించడం జరిగింది. శరభయ్యగారిని తాత్కాలికంగా పదవినుంచి తప్పించాల్సిందిగా రెవెన్యూ అధికార్లకు సిపార్సుచేసి వెంకటేశాన్ని తిరిగి ప్రధానోపాధ్యాయునిగా ఏర్పాటు చేశారు. ఆ నాటి మహాసభకు ఒక్క శరభయ్యతప్ప - అంతా వచ్చారు.

---

యంత్రాల సహాయంవల్ల ఉత్పత్తి చెయ్యలేనివి మానవుడికి యింకా కొన్ని మిగిలి ఉన్నాయి. గొప్ప కవిత్వం,చిత్రలేఖనం, తాత్త్విక జిజ్ఞాస—వీటిని యంత్రాల ద్వారా బనాయించలేము. అలాగే మానవ హృదయంలో జనించే ఆనందాన్ని, విషాదాన్ని, యంత్రంద్వారా కొలవలేము. స్నేహంలోని మాధుర్యం, ప్రేయసీ ప్రియుల ప్రణయ తాదాత్మ్యం—ఏ యంత్రం తెలుసుకోగలుగుతుంది?—బెర్ట్రాండ్ రసెల్.